www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | 5 | పశ్చిమ గోదావరి

నేడు కేంద్రమంత్రి సీతారామన్ జిల్లా పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు విజయవాడ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి 12 గంటలకు పెనుగొండ చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 12:45 వరకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నరసాపురం చేరుకుని రెండు గంటల నుండి మూడు గంటల వరకు నరసాపురం మున్సిపల్ అతిథి గృహంలో బస చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుండి 3.45 వరకు పిఎంలంకలోని డిజిటల్ కమ్యూనిటీ సెంటర్‌ను సందర్శించనున్నారు. అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్తారని సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

పవన్ ప్లానేమిటో..!

- 21న భీమవరం పర్యటన నేపథ్యంలో సర్వత్రా చర్చ
- జనసేన, టిడిపి ముఖ్య నేతలతోపాటు ప్రముఖులతో సమావేశం
- భవిష్యత్తు కర్తవ్యాలపై సుదీర్ఘ చర్చ
- పలు కీలక అంశాలు ప్రకటించే అవకాశం
- భీమవరం నుంచి పోటీపై క్లారిటీ ఇచ్చేనా?



ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పవన్ భీమవరం నుంచి పోటీ చేస్తారా.. లేక వేరేచోట నుంచి పోటీలో ఉంటారా.. జిల్లాలో ఎన్ని సీట్లలో జనసేన పోటీలో ఉండే అవకాశం ఉంది.. అసలు పవన్ వ్యూహం ఏమిటనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పవన్ భీమవరం పర్యటన ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో కొన్ని కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే పవన్ భీమవరం పోటీ నుంచి చేస్తారా, లేదా అనేదే హాట్ టాపిక్‌గా మారింది.

మరికొన్ని రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఎత్తులు, పైఎత్తులతోపాటు వ్యూహాత్మకంగా ముందుకు సాగేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పవన్‌కళ్యాణ్ భీమవరం పర్యటనకు వస్తున్నారు. ఈ నెల 14న భీమవరంలో పర్యటించాల్సి ఉన్నా చివరి నిమిషంలో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో పర్యటన వాయిదా పడింది. ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో ఈ నెల 21న పవన్ భీమవరం పర్యటన ఖరారైంది. భీమవరంలోని కాస్మోపాలిటిన్ క్లబ్ సమీపంలో పవన్ హెలికాప్టర్ ల్యాండింగ్‌కు హెలీప్యాడ్‌ను నేతలు సిద్ధం చేశారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో భీమవరం శివార్లలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్‌కు చేరుకోనున్నారు.

గతేడాది జూన్ 25న పవన్ జిల్లాలో పర్యటించారు. వారాహి యాత్రలో భాగంగా భీమవరం పర్యటనకు వచ్చిన పవన్‌కళ్యాణ్ ఐదు రోజులపాటు భీమవరం కేంద్రంగానే పార్టీ కార్యకలాపాలను నిర్వహించారు. అనంతరం కొద్ది విరామం తర్వాత ఏలూరు జిల్లా నుంచి పర్యటన ప్రారంభించి పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకులో యాత్ర ముగించారు. సుమారు ఆరు నెలల తర్వాత పవన్ కళ్యాణ్ జిల్లాలో మళ్లీ పర్యటించనున్నారు. జనసేనాని ఉభయగోదావరి జిల్లాలపై ప్రధానంగా కేంద్రీకరించి ముందుకు సాగుతున్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలు, 13 అసెంబ్లీ స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. కేవలం రెండు స్థానాల్లో మాత్రమే టిడిపి విజయం సాధించింది. దీంతో ఈసారి ఉమ్మడి జిల్లాలో పట్టు సాధించేందుకు జనసేన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. టిడిపితో పొత్తు నేపథ్యంలో జనసేన అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. పవన్ పర్యటనలో కీలకాంశాలపై చర్చ ఉండొచ్చని తెలుస్తోంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల ఎంపిక, పొత్తులతో కలిసి వెళుతున్న సందర్భంలో ఏర్పడే ఇబ్బందులు, ఉమ్మడి కార్యాచరణ, అభ్యర్థుల గెలుపునకు అవసరమైన ప్రణాళికపై చర్చ ఉండొచ్చునని ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా అభ్యర్థుల సీట్లు కేటాయింపుపై చర్చ ఉండొచ్చునని తెలుస్తోంది. ఇప్పటికే భీమవరం, నరసాపురం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, కైకలూరు లేక ఏలూరు నుంచి జనసేన అభ్యర్థులు పోటీ ఉండొచ్చునని ఆది నుంచి పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. దీనిలో భాగంగానే జనసేన ముఖ్యనేతలకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు కొన్ని ముఖ్యమైన అంశాల్లో పవన్ ఈ పర్యటనలో దిశానిర్దేశం చేయనున్నారు. టిడిపి ముఖ్యనేతలు శ్రేణులతో ప్రత్యేకంగా పవన్ సమావేశం కానున్నారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రధాన చర్చ జరగనుంది. ముఖ్య నాయకులతో పవన్ భేటీ అనంతరం టిక్కెట్ల కేటాయింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో జనసేన బలపడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గోదావరి జిల్లాల్లో జనసేన కొంత ప్రభావం చూపించింది. ఈ జిల్లాలో కాపు సామాజిక తరగతికి చెందిన వారు ఉండటమే దీనికి కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పవన్ కూడా పదేపదే ఈసారి అసెంబ్లీలో అడుగు పెడతామని చెబుతుండటం, ఇది సాధ్యం కావాలంటే తన సామాజిక తరగతి ఓట్లు ఎక్కువ శాతం ఉన్న ఉభయగోదావరి జిల్లాల నుంచే అది సాధ్యమవుతుందనే అంచనాతో ఉన్నారని తెలుస్తోంది.

భీమవరంలో పవన్ పోటీపై ఉత్కంఠ

భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు. అయితే ప్రస్తుతం పవన్ భీమవరం పర్యటన నేపథ్యంలో ఆయన ఎక్కడ నుంచి బరిలోకి దిగేదనే దానిపై ప్రకటన చేస్తారా అని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పార్టీ ముఖ్య నాయకులు, కేడర్ కూడా పవన్‌ను ఇక్కడి నుంచే పోటీ చేయాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. లోకల్, నాన్‌లోకల్ అనే భావన తీసుకొచ్చేలా అధికార పార్టీ వైసిపి సాగిస్తున్న ప్రచారానికి చెక్ పెట్టేలా భీమవరంలో పవన్ నివాసం ఉండేలా ఒక ఇంటి కోసం అన్వేషిస్తున్నట్లు తెలిసింది. దీంతో పవన్ ఇక్కడి నుంచే పోటీ చేస్తారని సాగుతున్న ప్రచారానికి బలం చేకూరింది. గత ఎన్నికల్లో పవన్ భీమవరం, గాజువాక నుంచి పోటీ చేసి పరాజయం పొందారు. అప్పటి గణాంకాల ప్రకారం నియోజకవర్గంలో 2,46,342 మంది ఓటర్లు ఉండగా మొత్తం 1,92,061 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌కు 70,642, వామపక్షాల మద్దతుతో బరిలో నిలిచిన జనసేన అభ్యర్థి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు 62,285 ఓట్లు, టిడిపి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులుకు 54,037 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ 8,357 ఓట్లు మెజారిటీతో పవన్ కళ్యాణ్‌పై విజయం సాధించారు. అయితే పోయిన చోటే వెతుక్కోవాలనే చందంగా జనసేనాని ఈసారి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ భీమవరం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఇప్పటి వరకూ స్పష్టత ఇవ్వలేదు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,51,301 మంది ఓటర్లు ఉన్నారు. దీంట్లో సుమారు 75 వేల మంది కాపు సామాజిక తరగతికి చెందిన ఓటర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో నూటికి నూరు శాతం పవన్ కళ్యాణ్ ఇక్కడ నుంచే పోటీ చేసే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పవన్ పర్యటనలో స్వల్ప మార్పు

భీమవరం, భీమవరం రూరల్: జనసేన అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ భీమవరం పర్యటనలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నట్లు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవన్ పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 20న పవన్ భీమవరంలో పర్యటించాల్సి ఉందని, ప్రస్తుతం రాజమండ్రిలో జరుగుతున్న సమావేశాల్లో కొన్ని మార్పులు చోటుచేసుకోవడం వల్ల భీమవరం పర్యటన 21వ తేదీకి మార్పు జరిగిందన్నారు. జనసేన-తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో ఆయన భేటీ అవుతారని తెలిపారు. పర్యటన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడిస్తారని చెప్పారు. జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ ఎన్ని కుట్రలు చేసినా పవన్ భీమవరం రాకుండా ఆపలేరని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రచార సహాయ కార్యదర్శి బండి రమేష్ కుమార్, మండల అధ్యక్షులు మోకా శ్రీనివాస్, ఎస్ఎస్.గిరి, దారపురెడ్డి త్రివిక్రమ్, నాగిడి శ్రీనివాస్, ఏడుకొండలు, పూర్ణిమ, పెదెట్టి తేజ, తుంపలా శ్రీను, గొర్ల గోపీ, రామాయణం శ్రీనివాస్, ఉండవల్లి శ్రీను, బన్ను ప్రసాద్ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు

భీమవరం: 'స్పందన'లో వచ్చిన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆర్‌డిఒ కె.శ్రీనివాసు లురాజు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 177 వినతులను భీమవరం ఆర్‌డిఒ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం-స్పందన' అర్జీదారులకు చక్కని పరిష్కారం చూపాలన్నారు. దీని వల్ల అర్జీదారులు సంతృప్తి పొందుతారన్నారు. నిర్ణీత గడువులోపుగా అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు బియాండ్ ఎస్-ఎల్ఎలోకి వెళ్లకుండా చూసుకోవాలని, ప్రతి అర్జీని అత్యంత బాధ్యతతో పరిశీలించి పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ శాఖాధికారి ఆర్.విక్టర్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ అప్పిలేటు సభ్యులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాలనీలో సదుపాయాలు కల్పించాలి

సిపిఎం బృందం

ప్రజాశక్తి - ఆకివీడు

నినదిస్తున్న నేతలు, కాలనీవాసులు

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన 73 ఎకరాల ఇళ్ల స్థలాల కాలనీలో ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ కాలనీలో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులతో నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చింది సెంటు భూమే అయినా పేదలు అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్నారన్నారు. ఆ ఇళ్లలోకి వెళ్లేందుకు కనీసం సరైన దారి లేక నానావస్థలు పడుతున్నారన్నారు. ఎర్రజెండా పోరాటంతో పేదలు ఈ ఇంటి పట్టాలు, ఇల్లు సాధించుకోగలిగారన్నారు. ఇప్పటి వరకూ కనీసం 700 మంది ఇళ్లు నిర్మించుకున్నారని, వారికి తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వంటి సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. మరోపక్క దొంగల భయం పెరుగుతోందని, పోలీసులు ఆ ప్రాంతాన్ని కూడా పర్యవేక్షించాలని కోరారు. పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సదుపాయాలు కల్పించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బి.రాంబాబు, డోకల రవితేజ, బివి.వర్మ, ఎర్ర కృష్ణవేణి, బత్తిన పార్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

మోతాదుకు మించి..!

రబీ సాగులో ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. నాట్లు ఆలస్యం కావడంతో వరి దుబ్బులు త్వరగా తయారు కావాలన్న భావనతో ఎరువులను పెద్దఎత్తున వేస్తున్నారు. గుళికలు, పురుగుమందుల వాడకం సైతం అదేరీతిన కొనసాగుతోంది. దీంతో రబీలో పెట్టుబడి ఖర్చు భారీగా అవుతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. నాట్లు ఆలస్యంతో రబీ దిగుబడులపై రైతుల్లో గుబులు నెలకొనడం, పెట్టుబడులు అధికమవుతున్న తీరు అన్నదాతను తీవ్రంగా కలచివేస్తోంది.

- రబీలో భారీగా యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వాడకం
- ఎకరాకు 7 నుంచి 8 బస్తాలు వినియోగం
- గుళికలు, పురుగు మందుల వాడకం అధికమే
- నాట్లు ఆలస్యం కావడమే ఈ పరిస్థితికి కారణమా?
- రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ విఫలం
- రబీ దిగుబడులపై రైతుల్లో గుబులు
- ఎకరాకు రూ.45 వేలు వరకూ పెరిగిన పెట్టుబడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలవ్యాప్తంగా రబీలో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. డిసెంబర్ మొదటివారంలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో రబీసాగుపై తీవ్ర ప్రభావం పడింది. ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేసి రబీ నారుమడులు వేసేసరికి డిసెంబర్ నెలాఖరైంది. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు 25 రోజుల వరకూ నాట్లు ఆలస్యమయ్యాయి. ఫిబ్రవరి పదో తేదీ వరకూ రబీ నాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. నాట్లు ఆలస్యం కావడంతో పంట ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మే నెలాఖరు వరకూ రబీ మాసూళ్లు సాగే అవకాశం ఉందని రైతుల అంచనా. దీంతో వరిపైరు త్వరగా ఎదిగేలా చేయాలని రైతులు భావిస్తున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎరువుల వాడకం భారీగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరాకు గతంలో నాలుగు బస్తాల ఎరువులు మాత్రమే వాడేవారు. ఇప్పుడు ఏకంగా ఏడు నుంచి ఎనిమిది బస్తాల వరకూ ఎరువులు వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనిలో సగం యూరియా, మరో సగం డిఎపి, 28-28-0, 14-14-0 వంటి కాంప్లెక్స్ ఎరువులను వాడుతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల బస్తా రూ.1700 పలుకుతోంది. ఈసారి ఎకరాకు రెండు బస్తాలు అదనంగా వేస్తుండటంతో ఎరువుల నిమిత్తమే రూ.నాలుగు వేలు పెట్టుబడి అదనంగా అవుతుందని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పంట అనుకున్న సమయానికి పక్వానికి రాకపోతే నీటిఎద్దడి సమస్య తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో 20 రోజుల వ్యవధిలోనే ఎకరాకు నాలుగు బస్తాలకుపైగా ఎరువులు వేస్తున్నారు. ఎరువులతోపాటు గుళికలు, పురుగుమందుల నిమిత్తం సైతం రైతులు పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నారు. ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. దీంతో గతంతో పోలిస్తే ప్రస్తుత రబీ సీజన్‌లో పెట్టుబడి ఖర్చు వరిసాగులో ఎకరాకు రూ.ఐదు నుంచి రూ.ఆరు వేల వరకూ పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ఈసారి ఎకరాకు రూ.45 వేలు వరకూ పెట్టుబడి అవనున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంత పెద్దఎత్తున పెట్టుబడి ఖర్చు పెడుతున్న రైతులకు రబీ దిగుబడులపై లోలోన గుబులు నెలకొంది. నాట్లు ఆలస్యం కావడంతో దిగుబడిపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే తీవ్ర నష్టాలు తప్పవని లోలోన ఆందోళన చెందుతున్నారు. కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లో భూములతోపాటు వివిధ మండలాల్లో శివారు భూములకు నీటిఎద్దడి సమస్య వస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుందని అన్నదాత భయపడుతున్నాడు. ఎరువులు, పురుగుమందుల వాడకం పెరిగిపోవడం సైతం పంట దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఖరీఫ్‌లో తుపాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన రైతులంతా రబీసాగుపైనా ఆశలు పెట్టుకున్నారు. రబీ పంట సక్రమంగా చేతికి అందకపోతే జిల్లా రైతాంగం కోలుకోలేని దెబ్బతినే పరిస్థితి ఏర్పడనుంది.

ఐదేళ్లవుతున్నా ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం అన్యాయం

కలెక్టరేట్ వద్ద పాలమూరు వాసుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం



నినదిస్తున్న నేతలు, బాధితులు

పెనుమంట్ర మండలం పాలమూరు గ్రామ శివారు నాగళ్లమెరక లో ఇళ్ల స్థలాలకు అర్హులైన వారి వద్ద నుండి సొమ్ము వసూలు చేసి ఐదేళ్లవుతున్నా ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం అన్యాయమని సిపిఎం పెనుమంట్ర మండల కార్యదర్శి కె.సుబ్బరాజు విమర్శించారు. భీమవరం కలెక్టరేట్ వద్ద నాగళ్లమెరక వాసులు సోమవారం నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల క్రితం ఇళ్ల స్థలాల కోసం స్థల సేకరణ పేరిట సుమారు రూ.12 లక్షలు సొమ్ము తక్కువైందని లబ్ధిదారుల నుండి వసూలు చేశారని, నేటికీ వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులు మాట్లాడుతూ స్థానిక వైసిపి నాయకులు తమకు ఫోన్ చేసి మీకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం కుదరదు, మీరు కట్టిన సొమ్ము తీసుకెళ్లండంటూ ఒత్తిడి చేసి సొమ్ము వెనక్కి ఇస్తున్నారని వాపోయారు. తాము అప్పు చేసి సొమ్ము కట్టామని, ఆ వడ్డీలు ఎలా కట్టాలని ప్రశ్నించారు. దీనిపై నాలుగు రోజుల క్రితం ఫోన్లో విఆర్‌ఒను సంప్రదించగా ఆ వివరాలు తనకు తెలియదని చెబుతున్నారన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ మాట్లాడుతూ సమస్యను వెంటనే పరిష్కరించాలని, అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని, లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి ఇళ్ల స్థలాలు అందించే వరకూ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు పంపన సూర్యనారాయణ, బొక్కా చిన్నారి, కవురు మల్లేశ్వరి, కవురు వరలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన వరి పరిశోధనా కేంద్రం కార్మికుల సమ్మె

పెనుమంట్ర (ఆచంట): మార్టేరు వరి పరిశోధనా కేంద్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఆ కేంద్రంలోని కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె నాలుగో రోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పని చేసే కార్మికులను పరిశోధనా కేంద్ర కార్మికులుగా గుర్తించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని, పేస్లిప్‌లు ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళనకు అంగన్వాడీ కార్యకర్తలు వి.భవాని తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు దమ్ము నూకరత్నం, కట్టా శ్రీలక్ష్మి నాగరాజు, జగదీష్ కిరణ్ కుమార్, సూర్య కుమారి, అరుణ కుమారి పాల్గొన్నారు.

వైసిపి మేనిఫెస్టోలో వాలంటీర్ల జీతం పెంపు

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు వాలంటీర్లు - డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

వాలంటీర్‌ను సత్కరిస్తున్న పివిఎల్, నేతలు

ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లు అంటే ప్రభుత్వానికి ఎంతో గౌరవం ఉందని, రాబోయే ఎన్నికల్లో వైసిపి మేనిఫెస్టోలో వాలంటీర్ల జీతం పెంపు అంశం ఉండొచ్చని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లు వారధులని, ఐదేళ్లలో ప్రజలకు వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో వారు ముందున్నారన్నారు. పాలకోడేరులో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) ఆధ్వర్యంలో వాలంటీర్లకు సోమవారం సత్కారం నిర్వహించారు. సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులతోపాటు మండలంలోని 400 మంది వాలంటీర్లకు పివిఎల్, చంటి రాజు చేతుల మీదుగా అవార్డులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహారాజు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోచుకున్నాయని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎంపిపి చంటి రాజు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ మనుగడకు, సంక్షేమ పథకాల కొనసాగింపునకు జగన్ మళ్లీ సిఎం కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అనుష్య, జెడ్‌పిటిసి పెద్దిశెట్టి లక్ష్మీతులసి సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపిపి ఆదాడ లక్ష్మీతులసి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, సర్పంచులు ఇంజేటి మరియమ్మ, కె.నాగేశ్వరి, చింతపల్లి చిన్న, చిల్లా అనూష, కోఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత, ఎంపిటిసిలు బొల్లం గాంధీ, పాలా జ్యోతి, నాగలక్ష్మి, స్వాతి, శాంతకుమారి, నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు సొంత భవనం లేకపోవడం బాధాకరం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్

ఉండి: ఉండి మండలం అర్తమూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు సొంత భవనం లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ విమర్శించారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి బి.వెంకటరమణకు స్పందన కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేసినట్లు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సుమారు 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు మొద్దునిద్ర వీడి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే సొంత భవనానికి నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.గణేష్, మండల కార్యదర్శి జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నిరసన తెలుపుతున్న మత్స్యపురి వాసులు

సమస్యలు పరిష్కరించాలని మత్స్యపురివాసుల ఆందోళన

ప్రజాశక్తి - వీరవాసరం

మత్స్యపురి గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పశువుల చెరువు పూడిపోయి పశువులకు తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పూడిక తీతకు పంచాయతీ తీర్మానం చేస్తే అధికారులు ఎందుకు అనుమతించడం లేదని ప్రశ్నించారు. ఏడో వార్డులో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. గ్రామంలో వైసిపి నాయకుల ఒత్తిడి వల్లే అధికారులు పంచాయతీ పాలకవర్గానికి సహకరించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కారిపల్లి శాంతిప్రియ, జనసేన మండలాధ్యక్షుడు జవ్వాది బాలాజీ, వైస్ ఎంపిపి అడ్డాల రాము, టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, చింతా కనకయ్య, వీరవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ పాలనతో విసుగు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్ పరిపాలనతో విసుగెత్తిపోయారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. సోమవారం పట్టణంలోని 3, 4, 5 వార్డుల్లో ఆయన విస్తృతంగా పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెరిగాయన్నారు. జగన్‌ను మహిళలు గద్దెదించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజులకే సిపిఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారని, 58 నెలైనా ఉద్యోగులపై కక్షగట్టి పోలీసుల్ని జగన్‌ను దించడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కెపిపాలెం స్కూల్లో సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెంలోని జట్టు ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని అణుశక్తి విభాగ యువ శాస్త్రవేత్తలు మహేష్, రెహ్మాన్‌తో సైన్స్ దినోత్సవం పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూక్లియర్ ఎనర్జీ - క్లీన్ ఎనర్జీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎనర్జీ అనేది ఎన్ని రకాలుగా మనకు లభిస్తుందని దానిపై వివరించారు. రాబోయే రోజుల్లో ఈ పాఠశాల నుంచి ఎంతోమంది సైంటిస్టులు తయారు కావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెవి.నరసింహమూర్తి, స్టాఫ్ సెక్రటరీ పి.శ్రీనివాస్, సిహెచ్.కృష్ణమోహన్, పి.నాగరాజు, మంగతాయారు ఉన్నారు.

శ్రీ సూర్యలో ఫేర్‌వెల్

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీ సూర్య జూనియర్ కళాశాలలో 2022-24 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఘనంగా 'ఫేర్‌వెల్ పార్టీ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం తులసీ హాస్పిటల్ డాక్టర్ బళ్ల మురళీ, విశిష్ట అతిథిగా ప్రముఖ మోటివేటర్, వాలిన్ లైఫ్ స్కిల్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి, నిశాంత్ రామ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ అధ్యక్షత వహించారు. మురళీ మాట్లాడుతూ ప్రతి పనిలో ప్రయత్నం లోపం లేకుండా పట్టుదలతో ముందుకు నడిస్తే విజయం సొంతమవుతుందన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసం ఆసక్తికరమైన అంశాన్ని ఎంచుకుని దాన్ని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విశిష్ట అతిథి శ్రీరామ్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడారు. డాక్టర్ బళ్ల మురళీ సమాజానికి సేవ చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల జెఇఇలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బ్రహ్మాజీ అతిథులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అడ్వయిజర్ బి.రామచంద్రరావు, సీనియర్ అధ్యాపకులు పాజిల్, డాక్టర్ జానకిరామ్, కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామి సన్నిధిలో సివి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు సివి మంగాదేవి సోమవారం క్షీరా రామ లింగేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం సందర్శించారు. ఆమెకు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యళ్ల సూర్య నారాయణ, ట్రస్టీలు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెకు స్వామివారి ఫోటోలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి గాంధీ పాల్గొన్నారు.

కార్యకర్తకు జనసేన నేతల సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన జనసేన కార్యకర్త చెంద్రశేఖర్‌కు జనసేన ఇన్‌ఛార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్, నాయకులు, వీర మహిళలు ఆపరేషన్ నిమిత్తం రూ.55 వేలు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన అంటే కుల మత భేదాలు లేని పార్టీ అన్నారు. జనసేన కుటుంబ సభ్యుల్లో ఎవరికి ఏ ప్రమాదం జరిగినా అందరం ముందు ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

డిఎల్‌పిఒగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిఎల్‌పిఒగా జె.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమండ్రి నుండి ఇక్కడకి బదిలీపై వచ్చారు. ఇప్పటికీ వరకూ ఇక్కడ పనిచేసిన డిఎల్‌పిఒ నాగలత రాజమండ్రి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను కార్యాలయం సిబ్బంది అభినందించారు.

టిడిపిలో చేరిన ఆకుల సుబ్బారావు

ప్రజాశక్తి - పాలకొల్లు


సుబ్బారావును టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ

వైసిపి పట్టణ నాయకులు, ప్రముఖ చార్టెడ్ ఇంజినీర్ ఆకుల సుబ్బారావు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. 'మన పాలకొల్లు మన రామానాయుడు' ఇంటింటి పాదయాత్రలో భాగంగా సోమవారం ఎంఎల్ఎకు సంఘీభావం తెలుపుతూ టిడిపిలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఎంఎల్ఎ ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వైసిపి హయాంలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు సిఎంగా ఉంటే అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సుబ్బారావును మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు జివి మాజీ కౌన్సిలర్ నారిన ప్రతాప్ అభినందించారు.

మీడియాపై దాడిని నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

అనంతపురం జిల్లా రాప్తాడులో సిఎం సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై చేసిన దాడిని ఖండిస్తూ భీమవరం కలెక్టరేట్ వద్ద ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో భీమవరం ఏరియా ప్రెస్ క్లబ్ ధర్నా నిర్వహించింది. అనంతరం స్పందనలో వినతి పత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కెవి.ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాజకీయ పార్టీల సభల్లో మీడియాపై దాడులు పెరుగుతున్నాయన్నారు. రాప్తాడులో ముఖ్యమంత్రి సభ ఫోటోలు తీస్తున్నప్పుడు కొంతమంది దాడి చేయడం దారుణమన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు డి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పట్ల అప్రమత్తంగా ఉండి, జర్నలిస్టులందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో స్పందనలో ఆర్‌డిఒ శ్రీనివాసులు రాజుకు విలేకరులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు విఎస్.సాయిబాబ, ఏపీయూడబ్ల్యూఐ ఎలక్ట్రానిక్ విభాగం జిల్లా కోశాధికారి ఎబిఎన్ వర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలకష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నూకల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉండి : అనంతపురం జిల్లా రాప్తాడు వైసిపి సిద్ధం సభలో విలేకరులపై దాడి చేసిన వైసిపి శ్రేణులపై తక్షణం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఉండి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఈతకోట యాకోబు రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఉండి మెయిన్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉండి ప్రెస్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిస్వార్ధంగా విలేకరులు పనిచేస్తున్నారని అటువంటి విలేకరులపై దాడి చేయడం అమానుషమన్నారు. అనంతరం తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి జామి అంజిబాబు, ఉపాధ్యక్షులు శేషాపు మణికంఠ, సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం: రాప్తాడులో మీడియా ప్రతినిధులపై వైసిపి రౌడీ మూకల దాడి దుర్మార్గమని రాష్ట్ర మాజీ మహిళ కమిషన్ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ప్రకటన విడుదల చేశారు. జగన్ సభలకు ఆయన అనుకూల మీడియా, నీలి మీడియా తప్ప మిగతా మీడియా రాకూడదా అని ప్రశ్నించారు. రాప్తాడు ఘటనలో నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాజ్యలక్ష్మి కోరారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఫ్యాన్ రెక్కలు విరవడానికి సిద్ధం

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎపిలో వైసిపి ప్రభుత్వ అరాచక, విధ్వంస పాలనపై సిఎంతో చర్చకు తామంతా సిద్ధమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. వైసిపి ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తూ అధికార దుర్వినియోగంతో 'సిద్ధం' సభలు పెడుతోందని, జగన్ చెప్పే అసత్యాలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జనం ఫ్యాన్ రెక్కలు విరగ్గొట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటమిపై జగన్‌కు స్పష్టత రావడంతో మళ్లీ ప్రజలను ఏమార్చడానికి చూస్తున్నాడని తెలిపారు. రాష్ట్రంలో జగన్ పాలనలో ఏ మూలన చూసినా అభివృద్ధి లేదన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అక్రమ కేసు పెట్టడం దుర్మార్గపు చర్య అని ఖండించారు.

వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

ఎంఎల్ఎ రామరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ప్రజలకు కార్యకర్తలకు ఎంఎల్ఎ మంతెన రామరాజు పిలుపునిచ్చారు. యండగండి గ్రామంలో సోమవారం టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ టిడిపి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి అధికారం చేపట్టాక నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెంచేశారని వాపోయారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వర రాజు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరి నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 31వ వార్షికోత్సవం, పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు పందల సన్యాసిరావు సంతాప సభ సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. పండ్ల మార్కెట్ జట్టు సీనియర్ నాయకులు నడిగర్ల త్రిమూర్తులు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సభా ప్రాంగణానికి పందల సన్యాసిరావు ప్రాంగణంగా నామకరణం చేశారు. ముందుగా సన్యాసిరావు, తాడేపల్లి పెద్దిరాజు చిత్రపటాలకు కర్రి నాగేశ్వరరావు, సిరపరపు రంగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2023 కార్యకలాపాల రిపోర్టును కార్యదర్శి గొర్రెల వంశీ ప్రవేశపెట్టగా యూనియన్ సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు 40 కోట్ల మందికి కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యుటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జవ్వాది శ్రీను, వైస్ ప్రెసిడెంట్‌గా తట్టాగొట్టి పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా కాయల దుర్గాప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా సారికి శ్రీను, కోశాధికారిగా పుట్టా ఏసు, కమాండర్‌గా మద్దూరి ఆనంద్, కమిటీ సభ్యులుగా సుంకర శ్రీను, సువ్వాడ రాంపండు, బాసింశెట్టి శ్రీను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, మెట్రెడ్డి రమణ, కుంచంగి నానాజీ, సతీష్‌కుమార్, రమణ, రామారావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - మొగల్తూరు


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి నూతన పాలకవర్గ సభ్యులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ సూచించారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయ నూతన పాలకవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తలి మండలి ఛైర్మన్‌గా కడలి మాణిక్యాలరావు, సభ్యులుగా ఈలపకుర్తి రమేష్ బాబు, బొల్లం శ్రీనివాసరావు, బాలం విజయ, బొక్క శ్రీలక్ష్మి, దాసరి లక్ష్మీ, తిరుమాని పెద్దిరాజు, సొర్ర కొండాలమ్మ, కొల్లాటి ధన కుమారి, కో ఆప్షన్ సభ్యుడిగా తుమ్మలపూడి రాధాకృష్ణతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్ మాణిక్యాలరావు మాట్లాడారు. గ్రామస్తులను, పాలకవర్గ సభ్యులను సమన్వయం చేసుకుంటూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఆలయ మాజీ ఛైర్మన్ కొల్లాటి రామారావు, సర్పంచులు కొప్పనాతి పల్లయ్య, కడలి సోంబాబు, దాసరి బాబి, కవురు ఆదినారాయణ పాల్గొన్నారు.

కాళికాంబ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంఎల్‌ఎగా పరకాల కాళికాంబ సేవలు ఎనలేనివి అని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల కాళికాంబ హైదరాబాద్‌లో మృతి చెందారు. సోమవారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఐ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ పరకాల కుటుంబం విలువలతో కూడిన రాజకీయం చేయడం వల్ల వారి కోడలు నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో కక్ష సాధింపులు పెరిగిపోయాయని, శేషావతారం మంత్రిగా పనిచేయగా, కాళికాంబ ఎంఎల్‌ఎగా కొనసాగారని, వీర కుమారుడు పరకాల ప్రభాకర్ ప్రభుత్వ సలహాదారుగా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కవురు పెద్దిరాజు, ఎంబిసి కార్పొరేషన్ ఛైర్మన్ పెండ్ర వీరన్న, స్వర్ణాంధ్ర విద్యాసంస్థల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, నర్సాపురం సహకార సంఘం అధ్యక్షులు షేక్ బుల్లి మస్తాన్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, దొండపాటి స్వాములు, కౌరు పెద్దరాజు, బాపుశ్రీ పాల్గొన్నారు.

బాధితురాలికి మందులు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

శివదేవునిచిక్కాల గ్రామానికి చెందిన కోట వరలక్ష్మి కంటి సంబంధిత సమస్యతతో బాధపడుతోంది. విషయాన్ని వాకర్స్ క్లబ్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్‌రావు ఆమెను విజయవాడ ఆసుపత్రికి పంపడంతో పాటు 20 వేల రూపాయల విలువైన మందులను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమా శంకర్ రావు, క్లబ్ సభ్యులు నంబూరి గంగా పవన్, జవ్వాజి కళ్యాణ్, అందే జైపాల్ నాయుడు, మల్లిపూడి ధనలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే జగన్ ధ్యేయం

ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

రాష్ట్రంలో గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పని చేస్తోందని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అర్ధవరంలో రూ.47.6 లక్షలతో రహదారుల పనులను ప్రారంభించారు. రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సిసి రహదారి పనులను ప్రారంభించారు అప్పన్నపేటలో రూ.20 లక్షలతో సిసి రోడ్లు, మల్లపురాజుపేటలో రూ.47.60 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ప్రారంభించారు. కేశవరంలో ఫిష్ ఇన్ ఆంధ్ర అవుట్లెట్ ప్రారంభించిన అనంతరం ఎస్.కొండేపాడులో రూ.47.6 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. మొయ్యేరులో రూ.20.లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్ధవరం గ్రామ సర్పంచి గాతల సుజాత అప్పన్నపేట సర్పంచి నూకారపు సుధాకర్ రావు, కేశవరం సర్పంచి మిడతని కామేశ్వరి, ఎస్.కొండేపాడు సర్పంచి శీతాళం వరలక్ష్మి, మొయ్యేరు సర్పంచి దూళ్ల కుటుంబరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లి గ్రామంలోని ఎస్‌సి కాలనీలో కొత్త సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచి పోతుల అన్నవరం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి అత్తింటి సోమశేఖరరావు, ఎంపిటిసి సభ్యులు పసుమర్తి సత్యనారాయణ, వార్డు సభ్యులు దూలపల్లి లక్ష్మి, దిర్శిపాముల పుష్పవతి, పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుని వైద్యానికి సాయం

నరసాపురం: మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర కళాశాల విద్యార్థులచే నెలకొల్పబడిన న్యూ కలర్స్ స్టూడెంట్ గ్రూప్ ద్వారా బాలుని వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా పొన్నమండకు చెందిన బాలుడు రామయోచనకు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. బాలుని వైద్యం నిమిత్తం రూ.24,000 న్యూ కలర్స్ స్టూడెంట్ గ్రూప్ వారు, కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరరీ కెవి.స్వామి, పాలకవర్గ సభ్యులు శ్రీహరి, ప్రిన్సిపల్ ఎఎన్.సురేశ్‌కుమార్, వైస్.ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్ చేతులు మీదుగా అందజేశారు.

అంతర్వేది ఉత్సవాలకు భారీగా జనం

కిక్కిరిసిన పంట్లు - నిబంధనలు గాలికి - అధికారుల చర్యలు నిల్

ప్రజాశక్తి - నరసాపురం

జనంతో కిక్కిరిసిపోయిన పంటు

అంతర్వేది తిరనాళ్లకు నరసాపురం మీదుగా మాధవాయి పాలెం పంటి నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు వెళ్తున్నారు. సోమవారం రాత్రి స్వామివారి కళ్యాణం, మంగళవారం స్వామివారికి రథోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో నరసాపురం మీదుగా ఏలూరు, కృష్ణా జిల్లా నుంచి పెద్ద ఎత్తున యాత్రికులు అంతర్వేదికి ప్రయాణమయ్యారు. పంటి వద్ద సచివాలయ, పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తొక్కిసలాట జరగకుండా క్యాలైన్లు బారికేడ్లు ఏర్పాటుచేశారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది హెల్త్ క్యాంప్‌లు బస్టాండ్, రైల్వే స్టేషన్, పంటి రేవు వద్ద ఏర్పాటు చేశారు. పంటి రేవు వద్ద గజ ఈతగాళ్లు లైఫ్ జాకెట్లతో సిద్ధంగా ఉన్నారు. ఆదివారం రాత్రి అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు మాధవాయిపాలెం రేవును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా పంటుల్లో ఆటోలు, కార్లు

సాధారణ సమయంలో కంటే అంతర్వేది కళ్యాణం, రథోత్సవం, పౌర్ణమి స్నానాల సమయంలో పంటుల్లో ఎక్కువ రద్దీ కనిపిస్తుంది. దానికనుగుణంగా అధికారులు కూడా ఏర్పాట్లు చేశారు. ఈ సమయంలో గతంలో పోలీస్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కార్లను పంటులోకి అనుమతిచ్చేవి కాదు. గతంలో కార్ల రూటును స్టీమర్ రోడ్డులోని సబ్ జైల్ వద్ద మళ్లించేవారు. ఈ సంవత్సరం గతంలో కంటే భిన్నంగా పంటులో నుండి కార్లను పంపించేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి కార్ల అనుమతి అనధికారంగా పంపించి వేశారు. పాటదారులుకు అనుకూలంగా అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పంటులో కార్ల నిలిపే ప్రదేశంలో ఇంకొంత పంటులో నిలవడానికి, గోదావరి రేవు దాడానికి అవకాశం ఉంది. తద్వారా నరసాపురం రేవు వద్ద రద్దీ తగ్గుతోంది. లైన్‌లో నిల్చునే వారికి సమయం కూడా ఆదా అవుతుంది. ప్రమాదాలు జరిగే అవకాశం కూడా తగ్గుతుంది. అయితే అక్కడ నిర్వాహకులు ఈ విధంగా కాకుండా మనిషి కంటే కారు వెళ్తేనే ఎక్కువ ఆదాయం వస్తుందని కార్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ పాటదారులు జేబు నింపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలు సైతం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పరిమితికి మించి పంటులో ఎక్కువ మందిని ఎక్కిస్తున్నారు. లైఫ్ జాకెట్లు కూడా ప్రయాణికులకు ఇవ్వడం లేదని తెలుస్తోంది.

ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడీగా తనిఖీలు నిర్వహిస్తారు తప్ప మామూలు సమయాల్లో పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. నరసాపురం ఎంపిడిఒ వెంకటరమణ వివరణ కోరగా ఈ నెల 25వ తేదీ వరకూ పంటుల్లో కార్లకు అనుమతి లేదన్నారు. ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. కార్లకు అనుమతి ఎట్టి పరిస్థితుల్లో లేదని తెలిపారు.

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుగొండ

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని నడిపూడి శివారు చింతలపాలెంలో రూ.25 లక్షల రూపాయల జిల్లా పరిషత్ నిధులతో చేపట్టనున్న డ్రెయిన్ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచి కడలి బేబీ అన్నపూర్ణ, వైసిపి నాయకులు, పూరీల్లా శ్రీను, కేశవరపు గణపతి, కడలి శ్రీను పాల్గొన్నారు

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డిఒ ఎంఎ అంబరీష్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 22 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిరాణా వర్తక సంఘం అధ్యక్షులుగా శ్రీను

మొగల్తూరు: మొగల్తూరులోని కిరాణా వర్తక సంఘం సభ్యులు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘం అధ్యక్షుడిగా గ్రంధి శ్రీను, కార్యదర్శిగా మానేపల్లి సుబ్బారావు, కోశాధికారిగా అద్దేపల్లి నర్సిరావును, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగళ్ల నాగు, కారుమూరి రాజా, సుబ్బారావు, మానేపల్లి గిరి, గుండు వేణు, ముత్యాలరావు, కిషోర్ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలు సాగించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు సాగిస్తూనే, కార్మికవర్గ హక్కుల కోసం, ప్రజా సంక్షేమం కోసం జరిగే అన్ని ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం ఏరియా తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్డు బెండింగ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం సిపాయిపేట లోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భవననిర్మాణ కార్మికుల సమస్యలపై నాలుగేళ్లుగా ఎఐటియుసి అలుపెరుగని పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దాదాపు 35 వేల క్లయిములు పరిష్కారం కాలేదన్నారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓసూరి వీర్రాజు, అంకం భాస్కరరావు, బోడపాటి, నాగేశ్వరరావు, దువ్వాడ శ్రీను పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచి** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని విస్సంపల్లి వెంకటేశ్వరరావు, వయస్సు : 37 సం॥, తండ్రి: విస్సంపల్లి బొడ్డియ్య, నివాసం :శివపురం గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్ డి లోని చింతలపూడి మండలం, యండపల్లి రెవిన్యూ శివపురం గ్రామ తాలూకా జిరాయితీ మెరక రి.నెం.751-4బి రు దాఖలా **డాక్యుమెంట్ నెం. 11129/2023,** య. 0-16 ట్లులో య.0- 02 ట్లు లేక చ॥గ॥ 96.8 లు స్థలమునకు హద్దులు : **తూర్పు** : డొంక దారి, **దక్షిణము** : విస్సంపల్లి దాసు గారి తాలూకా స్థలం, **పడమర** : విస్సంపల్లి సుజాత గారి స్థలం, **ఉత్తరం** : పంచాయితీ వారి సిమెంట్ రోడ్డు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, ఖమ్మం, 9849246278

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచి** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని తగరం మల్లేశ్వరరావు తండ్రి: తగరం సామేలు, వయస్సు : 40 సం॥, నివాసం : ప్రగడవరం శివారు శ్రీరామపురం గ్రామం, చింతలపూడి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైనను ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

పశ్చిమగోదావరి జిల్లా, చింతలపూడి మండలం, చింతలపూడి సబ్ డి. లోని చరిన ప్రగడవరం పంచాయితీలోని ప్రగడవరం గ్రామం తాలూకా జిరాయతీ మెరక - రి.నెం. 205-2 రు, య 5 -04 ట్లు **డాక్యుమెంట్ నెం. 30/2019** పురాలో మీకు విక్రయించిన చ॥గ॥ 252 లు ఖాళీ నివేశన స్థలంనకు హద్దులు : **తూర్పు** : తగరం భూలక్ష్మీ వగైరాల స్థలం, **దక్షిణము** : ఆర్ అండ్ బి రోడ్డు కొంత వరకు, కొమిరిపాలెపు వేణు గారి స్థలం కొంత వరకు, **పడమర** : రెడ్డి జానకి రాణి గారు వగైరాల స్థలం, **ఉత్తరం** : తమ్మూరి ప్రభాకరరెడ్డి గారి స్థలం

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, ఖమ్మం, 9849246278

పాస్‌పోర్టు పోయినది

గూటాల ఆశాజ్యోతి, భర్త: రవిబాబు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. మునమర్రు నుండి పెనుగొండ వెళుతుండగా నా యొక్క **EC Passport No. X0628060** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

అడ్రస్:
గూటాల ఆశాజ్యోతి
భర్త: రవిబాబు
డోర్ నెంబర్: 2-38, మునమర్రు
పశ్చిమగోదావరి జిల్లా, పిన్: 534324
సెల్: 8978779313

పాస్‌పోర్టు పోయినది

కొంబత్తుల వెంకటలక్ష్మి, భర్త: నర్సింహస్వామి అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. తూర్పుగరువు, పెనుమంచిలి నుండి ఆచంట వస్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్: **U1849947** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

అడ్రస్:
కొంబత్తుల వెంకటలక్ష్మి
భర్త: నర్సింహస్వామి, ఇంటి నెంబర్: 7-45/0
తూర్పుగరువు, ఆచంట మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్: 534123
సెల్: 9701300534

మహారాజశ్రీ 3వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 192/2023

Between:
ICICI Bank Limited, a Banking Company, constituted under the Companies Act, 1956, having its Registered Office at Landmark Building, Race Course Circle, Vadodra, a Branch in T.Nagar, Rajamahendravaram, represented by its Manager and G.P.A. holder by name Mohammad Althaf Hussain, S/o. Mohammad Sardar, Muslim, aged 38 years, JCJC Rajamahendravaram.
...Plaintiff

AND

Nalajala Syam Prasad, S/o. Satyanarayana, Hindu, aged 34 years, Flat No. 201, Opp. Andhra Bank, Floor No.2, Viswa Mohini Apartment, Subbarao peta, Tadepalligudem - 534101, West Godavari District JCJC, Tadepalligudem.
...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 04-3-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి 20-2-2024
డి.వి.కృష్ణారావు
అడ్వకేట్, రాజమండ్రి